

# భంగపాటు

రాగిణి ఒంటరిగా కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది ఆమె వేడి నిట్టూర్పులకు ఎదురుగా వున్న దీపం అటూ ఇటూ ఊగిసలాడుతోంది ఒక్కొక్క సమయంలో దీపం చాలా చిన్నదయి చీకట్లో కలిసిపోతానని బెదిరిస్తోంది దీనికి తోడు బైటనుంచి గాలి అలలు అలలుగా వచ్చి కలవరపెట్టేస్తోంది కళ్ళార్పకుండా ఆమె దీపంపైపే ఆవేశంగా క్షణంపాటు చూసింది మరుక్షణంలో దీపం పెద్దదయి నిలకడగా నిలబడుతోంది తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవటానికి గాలితో పెనుగులాడుతోంది

రాగిణి గజగజ వణికిపోతోంది గుయ్‌మని మోత వినిపిస్తోంది కీచురాళ్ళ ధ్వని మరీ వింతగా వినిపిస్తోంది తన యింటిచుట్టూ కాపలాదార్లులాగ ఎత్తుగా నిలబడ్డ తాటితోపును తలుచుకుంటే ఒళ్లు జలదరించి పోతుంది భయమేసి ఏడుపుమానేసింది ఓ క్షణం తాటాకులు గలగలమని మోగుతున్నాయి గుటకలువేస్తూ! బెదురుగా అటూ ఇటూ చూస్తోంది కళ్ళు మూస్తూ తెరుస్తూ గుమ్మంవైపుకే వింతగా చూస్తోంది ఎవరో వస్తున్నట్లు అలికిడి అయింది శ్వాస గబగబ పీలుస్తూ కళ్ళు నిలిపేసి భయంగా ప్రాణాలు బిగపెట్టుకుని కూర్చుంది

అంబికా ! అంటూ మెల్లిగా స్వరం వినిపించింది

రాగిణికి ప్రాణం లేచివచ్చినట్లనిపించింది

తాతా! అంటూ గబాలున లేచి ముందుకు అడుగు వేసింది బిగ్గరగా ఏడవటం మొదలు పెట్టింది

మళ్ళీ ఏమయింది! అమ్మేది? మళ్లీ కొట్టిందా! దాసు ఆదుర్దాగా అడుగుతున్నాడు

ఊ ఊ, అంటూ ఏడుస్తూనే వుంది

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

లేదులే అమ్మ లేదులే అంటూ ఓదారుస్తున్నాడు

ఇద్దరూ బైటకువచ్చి నిలబడ్డారు ఆకాశమంతా చుక్కలతో నిండివుంది చుట్టూ చీకటి ఆవరించుకుని వుంది గాలి రయ్‌మనివీస్తూ, తాటిచెట్లను కూడా ఊపేస్తోంది చెట్లమధ్యగా మిణుకు మిణుకు మంటూ దీపాలు కనిపిస్తున్నాయి. వాటిని చూస్తూ, అమ్మో అంటూ ఆయన్ను చుట్టేసింది.

'ఏమిటి? '

'అవిగో కొరివి దయ్యాలు! ' బెదిరి అనేసింది పగలల్లా అక్కడా యిక్కడా తిరిగి. వాళ్ళు చెప్పిన కబుర్లు, వీళ్ళు చెప్పిన మాటలు మెదడు లోకి తెచ్చుకుంటూ హడలి పోతోంది

'అవి దయ్యాలు కావు దీపాలు. అక్కడ ఎవరో అన్నం వండుకుంటు న్నారు ' దాసు నవ్వుతూ అన్నాడు

'అవి దయ్యాలే! ' బిక్క మొహం వేసుకుని, బెరుకుగా అంటోంది 'నువ్వు ఒట్టి పిరికి పిల్లవు'

ఆ చిక్కటి చీకట్లోంచి, ఓ దీపం ఊగిసలాడుతూ ముందుకు వస్తున్నట్లు కదులుతోంది

'తాతా తాతా ' అంటూ ఆయనచాటుకు చేరి ఆయాసపడి పోతోంది. దాసు తలెత్తి తీక్షణంగా చూసి, కొంచెందూరంలో వుండగానే పోల్చుకున్నాడు

'అదుగో . మీ అమ్మ వస్తోంది. లాంతరు పట్టుకుని...రాగిణిని రెక్క పట్టుకుని ముందుకు లాగాడు

ఊ ఊ .. ఊ . అంటూ మళ్ళీ సన్నగా ఏడవటం మొదలు పెట్టింది

'ఎక్కడికెళ్లావు! ' దాసు ప్రశ్నించాడు.

'ఎక్కడికైనా వెళ్లాలని వస్తుంది! . దీంతో ఎంత చావుం దనుకున్నా వేమిటి! నాయనతోపాటు యిది కూడా పోయినా, పీడ విరగడయి పోయేది! నామాట దక్కించేటట్లు కనబడటంలేదు ..అసలు అప్పుడే ఆ ఆసుపత్రిలోనే వదిలేసి వచ్చినా ఏ పీడ వుండేదికాదు' అంబిక అక్కసుగా అన్నది

దాసు తనలో తాను నవ్వు కున్నాడు

అంబిక గభాలున లోపలికి వెళ్లి పోయింది

'ఏం చేశావమ్మ చెప్పునాతో, ఏడ వక! ' దాసు, రాగిణిని బ్రతిమాలు తున్నాడు. రాగిణి ఏమీ సమాధానం చెప్పటంలేదు

'చెప్పు మరి! అమ్మెందుకు' కొట్టింది! ...

'ఎప్పుడూ నేను దొంగతనం చెయ్యేను తాత'! .. హడలిపోతూ అన్నది

'ఇట్లా ఎన్నిసార్లు చెప్పింది, మళ్ళీ ఎన్నిసార్లు చేసింది ' లోపల్నుంచి చివాలున అంబిక వచ్చేసింది.

'నిన్ను చూసి భయపడి పోతోంది.'

'ఇప్పుడెందుకు భయం! ...తప్పుడు పని చేసేటప్పుడు భయం ఉండాలి గాని....రావే లోపలికి....' కసురుకుంది.

'పో ... వెళ్ళు .... అన్నంతిను .... నిజంచెప్పటం నేర్చుకోవాలి... దొంగతనం చెయ్యటం ఎంత తప్పో, అబద్ధాలు చెప్పటంకూడా అంతే తప్పు!... 'ఏదో కారణంగా దెబ్బలుతింటూనే వున్నావు!....పద....లోపలికి పద.... అమ్మ కొట్టదులే యింకా!....'

'అదంతా భయమే! ... నేనంటే భయమున్నదయితే, మళ్లీ ఎత్తుకొస్తుందీ!....'

'దాన్నేమనక యింకా, అసలే భయపడి పోతోంది....' దాసు మెల్లిగా చీకట్లను చీల్చుకుంటూ సాగిపోయాడు.

ఉలిక్కిపడుతూ, బెరుకు బెరుకుగా ఒక్కొక్క అడుగువేస్తూ, లోపలికి వెళ్లి కూర్చుంది.

అంబిక చివాలునలేచి ముందుకు వచ్చింది.

'అమ్మా!....ఆకలయిందే....అందుకని ఏమన్నా కొనుక్కుని తిందామని ' తత్తరబిత్తరగా మాటలు గుటకలువేస్తూ అన్నది రాగిణి.

'ఆకలయిందని' పరాయివాళ్లింట్లో డబ్బులెత్తుకొస్తారా!....కాస్త ఆగుతే నేను రాకపోయానా....' ఓ కంచం ముందర పడేసింది, యింత అన్నంపెట్టి.

రాగిణి శరీరం వణుకుతోంది ఉక్కిరిబిక్కిరయి కూర్చుంది.

'తినవే! అల్లా చూస్తావు!....' కళ్లురిమింది అంబిక.

రాగిణి బిత్తరపోయి తల్లి మొహంలోకి చూస్తోంది.

'నిన్నే! అన్నం తిను!....ఆకలి కావటం లేదా ఏమిటి?....' కూతురు చెయ్యి పట్టుకుంది. చప్పున తలెత్తి, రాగిణి మొహంలోకి చూసింది. నుదురుమీద చెయ్యిపెట్టింది. వెచ్చగా తగిలింది. గుండె గుభేలుమంది గభాల్న ఒళ్ళోకి తీసుకుంది. కాగిపోతోంది శరీరం.

అమ్మా దాహం, దాహం అంటూ పడుకుంది. తెగఆయాసపడి పోతోంది అంబిక తత్తరలాడి పోతోంది. అంతా నిర్మానుష్యంగా వుంది. పిలుస్తే ఎవ్వరూ పలికేటట్టు లేరు.

అమ్మాయి, అమ్మాయి అంటూ రెండుసార్లు పిలిచింది.

ఊ .... ఊ .... అంటూ మూలుగుతోంది.

ఆ రాత్రిపూట ఎక్కడికీ వెళ్లేటట్లు కనబడటంలేదు. అంతా దైవంమీద భారంవేసి గృహవైద్యం ఏదో చేసింది.

తనకు నిజంగా కోపంవస్తే ఒళ్లూపై తెలీదు. చిన్నపిల్ల తెలిసో, తెలీకో చేసిన పనికి, తాను అంత పట్టుదలపట్టి, చావబాదింది. అసలు ఆ దెబ్బతోనే ధడుచుకుని పోయింది. గుండెల్లో అధైర్యం ఏర్పడిపోయింది. జ్వరం వచ్చేసింది.

అంబికకు కంటిమీద కునుకు లేదు. ఏమిటా భగవంతుడా అని ప్రార్థిస్తూ కూర్చుంది.

తెల్లారిన తర్వాత కూడా, రాగిణి అట్లాగే మూలుగుతూ వుంది. దాసు దగ్గరకు వెళ్లదామంటే మనస్కొప్పటం లేదు. తనను ఏమన్నా అంటాడేమో నని అభిమానంతోనే వుండి పోయింది. డాక్టరు వచ్చి చూసిపోయాడు. ఫీజు క్రింద మూడు రూపాయలు చెల్లించు కుంది. నోటు మారిస్తే, యింకా రెండు రూపాయలే మిగిలినాయి. మందు వ్రాసి యిచ్చాడు కొనుక్కుని రమ్మన మని. ఆదుర్దాగా బజారు వెళ్ళి కను క్కుంటే, నాలుగున్నర చెప్పాడు. అలాంటివి మూడు యివ్వాలిట కూడాను. అంబిక కంగారు పడి పోయింది. ఎట్లాగు అని గాభరా పడి పోతోంది.

మామూలు మందులకయితే ఈ జ్వరం లొంగదు. ఆ క్యాప్సుల్స్ వాడాల్సిందే అని డాక్టరు ఖచ్చితంగా చెప్పి మరీ వెళ్లాడు.

పిచ్చి ఎత్తిన దానిలాగ అటూ ఇటూ తిరుగుతోంది. మూడు మూనాళ్ళకు వచ్చి యోగక్షేమాలు కను క్కుని వెళ్ళే దాసుకూడా యీ మధ్య యీ ఛాయలకే రావటంలేదు. అంతా అయోమయంగా వుంది.

దీపాలు పెట్టేశారు. రాగిణిని మెల్లిగా లేవదీసి, కూర్చో పెట్టింది. వెర్రిగా ఆలోచిస్తోంది. ఆసుపత్రికే తీసుకు వెళ్లి, డాక్టరుకే అప్పుచెప్పేసి ఆయన కాళ్ల మీద పడి ప్రార్థిద్దామను కుంది. వాకిట్లో రిక్షాను ఆపి, తాను కూర్చుని కూతుర్ని ఒళ్ళో కూర్చో పెట్టుకుంది. గబగబ ఆసుపత్రి వైపుకు వెళ్లుతున్నారు.

తీరా అక్కడికి వెళ్ళేటప్పటికి, డాక్టరుగారు లేడు. కూతుర్ని బల్లమీద పడుకో పెట్టింది. చైతన్య రహితంగా క్షణకాలం నిలబడి పోయింది.

'ఆయనిప్పుడు రాడు. అయినా ఆయన రావటం ఎందుకు! మొన్న రాసి యిచ్చిన మందు వాడావా' అని నర్సు అడుగుతూనే యింకో గదిలోకి వెళ్లి పోయింది.

అంబిక మొద్దుబారి పోయింది కూతురు వైపుకు ఆవేదనగా చూసింది. రొప్పుతోంది తెగ బాధపడుతున్నట్లు కనిపిస్తోంది తన కడుపు తరుక్కుపోతోంది కూతురు ఏమవుతుందో అని హడలి పోతోంది

అటూ ఇటూ చూసింది వింత ఆలోచన క్షణంలో. బుర్రలోకి వచ్చి దూరింది బాగా ఆయాసపడిపోతోంది గుటకలు వేస్తూ నిశ్శబ్దంగా డ్రాయరు దగ్గరకు వచ్చి, తలుపు మెల్లిగా తెరిచింది చిల్లర అక్కడా ఇక్కడా విరజిమ్మి వుంది కాస్తమూలగా కొత్త నోట్లు కళ్లు జిగేలు మన్నట్లు కనపడ్డాయి.

గుండె ఝల్లు మంది మళ్లీ అటూ ఇటూ బిత్తరుపోతూ చూసింది చప్పున చేతిని డ్రాయరులోకి పోనిచ్చి, గుప్పెటితో చిక్కిన నోట్లను తీసుకుని, గభాలున చీరె కొంగులో చుట్టేసుకుంది

ఒళ్లు జలజలలాడి పోతోంది ముచ్చెమట్లు పోసినాయి కళ్లు గిర్రున తిరిగినాయి చేతులూ కాళ్లూ వణికిపోతున్నాయి ఒక్క క్షణం కూడా నిటారుగా నిలబడలేక పోతోంది టేబుల్ ఆసరాతో మెల్లిగా వచ్చి కూతురు దగ్గర నిలబడింది

రాగిణి రెండు కళ్లూ నిలిపేసి తల్లి మోహంలోకి వింతగా చూసింది. అంబిక గుండె గుభేలుమంది హృదయ చలనం ఆగిపోయి నట్లనిపించింది. కొయ్యబారిపోయి నిలబడి పోయింది

రాగిణి పెదిమలు కదిలిస్తూ ఏదో చెప్పటానికి ప్రయత్నం చేస్తున్నట్లు కనబడుతోంది తల్లిని చూసి పేలవంగా పల్లు బైట పెట్టింది.

'అమ్మా! నా మందుకేనా!... తీసుకురా తాతతో చెప్పన్లే.'

రాగిణి అమాంతం తల్లిని చుట్టేసుకుంది ★

